# ఇంక్రి"మెంటల్" సమస్య

గుర్నాధానికి గుడివాడ నుంచి టెలిగ్రాం వచ్చింది.

బ్లెస్డ్ విత్ టు డాటర్స్--ట్విన్స్.

ఒక్క నిముషం గుండె ఆగినంత పనయింది. కొండంత ఆశ పెట్టుకున్న గుర్నాధానికి గుండెల్లో ఎవరో గునపం దించినట్టయింది.

తొలి కాన్పు కూతురు పుట్టింది. మలికాన్పు కొడుకు పుడతాడన్నది అతని తిరుగులేని నమ్మకం. ఎమ్మెస్సీ ఫిజిక్స్ డిస్టింక్షన్‌తో పాసయిన గుర్నాధానికి జాతకాలన్నా. బాబాలన్నా వల్లమాలిన గురీ, భక్తీని. అవధూతానంత స్వామివారి ఆశీస్సు అబద్ధమయిపోయిందా ? అయ్యయ్యో ! వారి ఆశ్రమానికి అయిదువందల విరాళం కూడా చెల్లించేశాడే !

గుర్నాధం గుండె రాయి చేసుకున్నాడు. ముత్యం ముగ్గురాడపిల్లల తండ్రయినందుకు లోలోపల దుఃఖంగా వున్నా పైకి నిబ్బరంగా వుండేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. ఆడపిల్లలపట్ల అటువంటి దృక్పథం చాలా తప్పని మిత్రుడు సత్యం చెబుతూనేవున్నాడు. అతను ఒకందుకు చెబితే గుర్నాధం మరొకందుకు సరిపెట్టుకున్నాడు.

ఒకనాటి శుభముహూర్తాన గుర్నాధం-బల్లెక్కేశాడు-అదే. ఆస్పత్రిలో ఆపరేషన్ బల్ల-ఎక్కేశాడు. అదితెలిసిన అతని భార్య ధనలక్ష్మి కంటికీ కడుపుకీ ఏకధారగా దుఃఖించింది. ఆస్పత్రినుంచి ఇవతలికి వచ్చిన తరువాత - సర్టిఫికెట్ జోడించి, తనకు రెండు ఇంక్రిమెంట్లు ఇవ్వవలసిందిగా ఆఫీసరుగారికి అప్లికేషన్ పెట్టుకున్నాడు.

నెల తరవాత అప్లికేషన్ పై ఆఫీసర్‌గారి 'క్వెరీ'తో అది కాస్తా తిరిగి వచ్చింది.

"ముగ్గురు పిల్లలు కనుక నీకు ఒకే ఇంక్రిమెంటు వస్తుంది. రెండు ఇంక్రిమెంట్లురావు" అనిరిమార్కు!

ముగ్గురు పిల్లలయినప్పటికీ రెండేకాన్పులు గనుక, తనకు రెండు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని గుర్నాధం వాదన. అతని అప్లికేషన్ క్లారిఫికేషన్ (స్పష్టీకరణ!!) నిమిత్తం మహారాజశ్రీ ప్రభుత్వం వారి దగ్గరికి వెళ్ళింది. అది అక్కడ పడుకుంది.

ఈమధ్య -సరికొత్త రిమార్కులతో మొత్తం ఫైలు మళ్ళీ 'పైకి' పంపించారు. కాన్పులు మాత్రమే లెక్క చూడవలసిందనీ, కవల పిల్లలు పుట్టినందుకు తన బాధ్యత ఎంత మాత్రం లేదనీ, న్యాయం ఆలోచించవలసిందనీ గుర్నాధం సవివరమైన, సరికొత్త అప్లికేషన్ కూడా పెట్టుకున్నాడు.

మళ్ళీ రిమైండర్లు పంపగా..... పంపగా..... "ఈ సమస్య చురుకుగా పరిశీలించబడుతున్నది' '.- అని సమాధానం వచ్చింది,

అదే శాఖలో పని చేస్తున్న అనంత సుబ్రహ్మణ్యానికి కంగారు బయలుదేరింది. అతని భార్యకు నాలుగు కాన్పులకూ-ఒకే కొడుకు దక్కాడు. సంతానాన్నిబట్టి ఇవ్వాలిగాని. కాన్పుల్నిబట్టి ఇంక్రిమెంట్లు ఇస్తే కొంపలంటుకుపోవూ ? అంచేత లోపాయికారీగా గుర్నాథం కాయితం నీళ్ళుకారిపోయే ప్రత్నాలు ప్రారంభించాడు.

కాయితాలు కదలాలంటే ప్రయత్నాలు చెయ్యాలిగాని. నీళ్ళు కారిపోవడానికి ప్రయత్నాలు దేనికీ ? ఆపని మాహారాజశ్రీ ప్రభుత్వం వారికి వెన్నతో పెట్టిన విద్య.

ఏడాదిపాటు నాని నాని నాని గుర్నాథం సమస్య నీళ్ళుకారి పోయింది.

"యువర్ రిక్వెస్ట్ కెనాట్ బి కంప్లయిడ్ విత్." (మీ అభ్యర్థన అంగీకరింపబడజాలదు.) - అని క్లుప్తమైన తాఖీదు పైనుంచి కిందికి వచ్చింది.

గుర్నాథం మనసులో నిరాశతో కుంగిపోయాడు. ముగ్గురు ఆడపిల్లల్ని ఆడించుకుంటూ ఆనందించడానికి ప్రయత్నిస్తున్నాడు.

చాలా ఆలస్యంగా-ఒక ఫామిలీప్లానింగ్ ఇంక్రిమెంట్ మాత్రం శాంక్షనయింది, ప్రతినెల పాతిక రూపాయలు ! ప్రభుత్వ జీ.ఓల్నీ, ఆర్డర్లనీ ప్రశ్నించడానికి ఉద్యోగులం మనమనగా ఎంత ! ?

★ ★ ★

అయిదేళ్ళ తరువాత గుర్నాథానికి ...... అవును గుర్నాథానికే ...... కొడుకు పుట్టాడు. ఆపరేషన్ ఫెయిలయిందని డాక్టర్లు చెప్పారు. ఏ చింతా లేకుండా అతనికి సుఖంగ సంసారం చేసుకుంటున్నాడు.

***రచన : జూలై 1984***

***ప్రచురణ : ఆంధ్రజ్యోతి వార పత్రిక 24-8-84***